# అక్కడ కేసీఆర్.. ఇక్కడ పోచారం ఉండాలె

- ఇందిరమ్మ ఇండ్ల పేరిట కాంగ్రెస్ దోపిడీ
- కర్ణాటకలో ఇచ్చిన హామీలకే దిక్కులేదు
- తెలంగాణలో మళ్లీ 6 గ్యారంటీలా?
- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



సుంకినిలో కుర్మ సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ పోచారం

కోటగిరి/దుద్రూర్/బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 30: ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులు 60 ఏండ్లలో తెలంగాణకు ఏలాంటి నిధులు మంజూరు చేయలేదని, ప్రత్యేక రాష్ట్రం వచ్చాక తొమ్మిదేండ్లలోనే సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పోతంగల్ మండలం సుంకిని గ్రామంలో శనివారం సుమారు రూ. 3.50కోట్ల పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. రుద్రూర్ మండలం రాణంపల్లి, రాయకూర్ క్యాంపు గ్రామాల్లో దాదాపు రూ. 3.30కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామంలో రూ. కోటితో చేపట్టిన పనులను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో స్పీకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో భారీగా నిధులు తెచ్చి బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. కొత్త ఎమ్మెల్యే వస్తే అభివృద్ధి కాగితాలకే పరిమితమవుతుందని అన్నారు. కేసీఆర్‌కు తనపై ఉన్న ప్రేమ, నమ్మకంతో అడిగినన్ని నిధులు ఇస్తున్నారని తెలిపారు. ప్రజల దీవెనలతో రెండుసార్లు గెలిచిన తాను.. హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. అక్కడ సీఎం కేసీఆర్.. ఇక్కడ పోచారం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.500 కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, మన ఊరు-మనబడికి భారీగా నిధులు కేటాయించారని గుర్తుచేశారు. విద్యార్థులకు చదువే బ్రహ్మాస్త్రం అన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ గృహలక్ష్మి పథకం మంజూరు చేస్తామన్నారు. మహారాష్ట్రలో ఏలాంటి సంక్షేమ పథకాలు లేవని, ఇక్కడ అమలు చేస్తున్న కార్యక్రమాలను చూసి తెలంగాణకు వస్తామని దరఖాస్తు చేసుకుంటున్నారని గుర్తు చేశారు.

**కాంగ్రెస్ ఇచ్చిన హామీలకే దిక్కులేదు..**

కర్ణాటక ఎన్నికల్లో హామీలిచ్చి గెలిచిన కాంగ్రెస్ పార్టీ.. నేడు ఒక్కటి కూడా అమలు చేయడంలేదని సభాపతి అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి నేడు బెంగళూరు నగరానికే కరెంట్ ఇవ్వడంలేదన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న కాంగ్రెస్.. డీజిల్ లేక బస్సులు కూడా నడపడంలేదన్నారు. ప్రజలకు బియ్యం లేక అక్కడి సీఎం.. మన కేసీఆర్‌కు ఫోన్ చేసి బియ్యం కావాలని అడుతున్నారని గుర్తుచేశారు. అక్కడి హామీలకే దిక్కులేదుగానీ, మళ్లీ తెలంగాణలో 6 గ్యారంటీల పేరిట మోసం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట పెద్దఎత్తున కుంభకోణం జరిగిందని, ఇండ్లు కట్టకుండానే కోట్ల రూపాయల బిల్లులను మింగేశారని విమర్శించారు. మోసపూరిత హామీలిచ్చే పార్టీలను నమ్మొద్దని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్‌ను మూడోసారి గెలిపించాలని స్పీకర్ కోరారు. సిద్ధాపూర్ రిజర్వాయర్‌తో గట్టుమీది గ్రామాలను సస్యశ్యామలం చేస్తామని స్పీకర్ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, ఎంపీపీలు సునీతా శ్రీనివాస్, సుజాతా నాగేందర్, నీరజావెంకట్రాంరెడ్డి, జడ్పీటీసీలు శంకర్‌పటేల్, గంగారాం, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సిరాజ్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన..

బాన్సువాడ టౌన్, సెప్టెంబర్ 30: బాన్సువాడ పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు మంత్రి కేటీఆర్ ఈ నెల 4న పర్యటించనున్న నేపథ్యంలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి సభకు హాజరేయ్యే వారికి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. పనులు మిగిలిపోతే వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వారి వెంట బల్దియా చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, ఆర్డీవో భుజంగరావు తదితరులు ఉన్నారు.



స్థానిక నాయకులకు సూచనలిస్తున్న స్పీకర్

# అభివృద్ధికే ప్రజల బ్రహ్మరథం

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల
- నగరంలో అభివృద్ధి పనుల ప్రారంభం

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 30: అభివృద్ధికే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. నగరంలోని పలు డివిజన్లలో కోటి రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఇప్పటికే ఆహ్లాదకరమైన వాతావరణంతో మినీ ట్యాంక్ బండ్, ఆధునిక సదపాయాలతో వైకుంఠధామాలు నిర్మించామని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఐటీ టవర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్థానిక యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ అందించేందుకు న్యాక్ భవనాన్ని నిర్మిస్తున్నామని వివరించారు. నగర ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సిర్ప రాజు, ఎనుగందుల మురళి, 41వ డివిజన్ కార్పొరేటర్ బురుగుల ఇందిరా, పార్టీ నగర అధ్యక్షురాలు చాంగుబాయి, నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

# ఎన్నికల ప్రచారకర్తగా మలావత్ పూర్ణ

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబర్ 30 : ఎన్నికలు, ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం పలు రంగాలకు చెందిన ప్రముఖులను ప్రచారకర్తలుగా నియమించింది. ఇందులో అతిపిన్న వయస్సులోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించిన ఉమ్మడి జిల్లాకు చెందిన పర్వతారోహకురాలు మలావత్ పూర్ణకు చోటు దక్కింది. ఓటరు జాబితాలో పేరు సరిచూసుకోవడం, ఈవీఎంలపై అవగాహన, ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రజల్లో చైతన్యం తెచ్చేలా ప్రచారం నిర్వహిస్తారు. ప్రస్తుతం ఉస్మానియ యూనివర్సిటీలో పీజీ చేస్తున్న పూర్ణ.. తనను ఎన్నికల ప్రచారకర్తగా ఎంపిక చేయడంపై సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆమెను పలు స్వచ్ఛంద సంస్థలు అభినందించాయి.



# గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- మాచారెడ్డి మండలంలో రూ. 11కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

మాచారెడ్డి, సెప్టెంబర్ 30 : గ్రామాల అభివృద్ధికి కేసీఆర్ సర్కారు పెద్దపీట వేస్తున్నదని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్, పాల్వంచ మండలంలోని ఏల్పుగొండ, పాల్వంచ, వాడి, ఫరీద్‌పేట, భవానీపేట, ఆరెపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ. కోటితో చేపట్టనున్న చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గంప గోవర్ధన్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో రూ.11 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఫరీద్‌పేట గ్రామంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌తో కలిసి గ్రంథాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు నేడు ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయని అన్నారు. రూ.40 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయం రాజభవనంలా ఉన్నదని కితాబిచ్చారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరుగుతున్నదని తెలిపారు.



చుక్కాపూర్ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

# కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే కాటేస్తారు

- వాళ్లు ఐదేండ్లకోసారి వచ్చే సంక్రాంతి గంగిరెద్దులు
- కేసీఆర్ సబ్బండ వర్గాల దేవుడు
- మళ్లీ గెలిపిస్తే జీతగాడిలా పనిచేస్తా : ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మాక్లూర్, సెప్టెంబర్ 30: కాంగ్రెస్, బీజేపీలకు ఓటు అభివృద్ధికి చేటని పీయూసీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. వాళ్లు ఐదేండ్లకోసారి వచ్చే సంక్రాంతి గంగిరెద్దులని, మోసపూరిత మాటలు నమ్మి ఓటేస్తే కాటేస్తారని అన్నారు. ఐదేండ్లలో కాంగ్రెస్, బీజేపీ నాయకులెవరైనా మీ గ్రామాలకొచ్చారా? అని ప్రశ్నించారు. నమస్తే నవనాథపురంలో భాగంగా మండలంలోని రాంచంద్రాపల్లిలో శనివారం ప్రజాశీర్వాద యాత్ర నిర్వహించి ప్రగతి నివేదికను ఆవిష్కరించారు. గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన ప్రతిఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ప్రజల యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు తప్ప జనం పాట్లు పట్టవని ధ్వజమెత్తారు. ఒక్క బీఆర్ఎస్సే ఇంటిపార్టీ అన్ని, కేసీఆర్ సబ్బండ వర్గాల దేవుడని అన్నారు. తెలంగాణ పథకాలు దేశంలో ఎక్కడైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. పదేండ్లలోనే వందేండ్ల అభివృద్ధి సాధించామన్నారు. రాంచంద్రాపల్లి గ్రామపంచాయతీకి ఏటా రూ. 24.6 లక్షల చొప్పున మొత్తం రూ. 92.2 లక్షల అభివృద్ధి నిధులొచ్చాయని తెలిపారు. 471 మందికి ఆసరా పెన్షన్లు వస్తున్నాయని, వీటిలో వృద్ధులకు 67, వితంతువులకు 134, దివ్యాంగులకు 20, ఒంటరి మహిళలకు 13, బీడీ కార్మికులకు 239, ఒక గీత కార్మికుడిని కలుపుకొని యేడాదికి రూ.1.18 కోట్ల పింఛన్లు అందిస్తున్నట్లు వివరించారు. వీటితోపాటు కల్యాణలక్ష్మి, షాదీముబార్, సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశామని తెలిపారు. అభివృద్ధిలో ఆర్మూర్ నియోజకవర్గాన్ని పరుగులు పెట్టిస్తున్న తనను మూడోసారి దీవిస్తే జీతగాడిలా సేవచేస్తానన్నారు. అంతకు ముందు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామానికి వెళ్లిన జీవన్‌రెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. పలు సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు.



గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

**జీవన్‌రెడ్డి సమక్షంలో చేరికలు..**

రామచంద్రాపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. గుత్ప ఉప సర్పంచ్ రాఘవేందర్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పారు. డీకంపల్లి గ్రామానికి చెందిన 30 యాదవ కుటుంబాల బీఆర్ఎస్ పార్టీలో చేరగా జీవన్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్న జీవన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, దొడ్లె రాజు నాయకులు పాల్గొన్నారు. డొంకేశ్వర్ మండలకేంద్రానికి చెందిన పెద్దబార్ల సంఘం, తుమ్మల సంఘం, గూండ్ల సంఘం, గౌడ చిన్న సంఘం, మాదిగ, మాల మహిళా సంఘాలకు చెందిన సభ్యులు జీవన్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న జీవన్‌రెడ్డి